
నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కనగల్ మండలం పర్వతగిరి గ్రామంలో ముగ్గు వేస్తున్న మహిళలు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్, డైరీని సంఘం రాష్ట్ర కార్యదర్శి చావ రవితో కలిసి నకిరేకల్‌లో ఆదివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, సంక్షేమ నిధి జిల్లా కన్వీనర్ గేర నర్సింహ, జిల్లా ప్రతినిధులు అరుణ, నర్రా శేఖర్‌రెడ్డి, యాట మధుసూదన్‌రెడ్డి, రమాదేవి, మురళయ్య, యాకయ్య, తిరుమలయ్య, యాకయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు తాటిపాముల నర్సిహమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఇటీవల టీఎస్ యూటీఎఫ్ ప్రతినిధి, స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయుడు బిచినేపల్లి శ్రీనివాస్‌రావు (53) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రావు సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.6 లక్షల చెక్కును శ్రీనివాస్‌రావు కుటుంబీకులకు అందజేశారు.


క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలు 2023లో గడీల పాలన అంతం చేసి ప్రజా పాలనకు పట్టం కట్టారని, 2024 కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు తనమీద పెట్టిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయకుండా నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా గుత్తా అమిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ టూటౌన్ : గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం నల్లగొండలోని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, అయితగాని స్వామిగౌడ్, హరికృష్ణ, వెంకటేశ్వరరావు, గోపాల్‌రెడ్డి, అనీస్ ముక్తర్, హన్ను, జగన్‌మోహన్‌రావు, అభిమన్యు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను చిట్యాలలో గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, పాటి మాధవరెడ్డి, కొలను వెంకటేష్‌గౌడ్, రాచకొండ కిష్టయ్య, జనగాం నర్సింహగౌడ్, పల్లపు బుద్ధుడు, పోలెపల్లి సత్యనారాయణ, కోనేటి ఎల్లయ్య, బాలగోని రాజు, కుక్కల భిక్షం, వేలుపల్లి సందీప్, చిన్నపాక నాగరాజు పాల్గొన్నారు. అదేవిధంగా పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో చిట్యాల, ఉరుమడ్ల ఆస్పత్రుల్లో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామిగౌడ్, రూపని యాదయ్య, రూపని భిక్షమయ్య, జన్నపాల శ్రీను, పాకాల దినేష్, జన్నపాల గోపాల్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, 30వ వార్డు కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్ గౌడ్ నల్లగొండ పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో సుఖః సంతోషాలు, ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నామన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కనగల్: మండల పరిధిలోని రేగట్టె ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కనగల్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. యోగా, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తీగల మోహన్‌రావు, గోలి అమరేందర్ రెడ్డి, జెల్లా దశరథ, శివశంకరరావు, సింహాద్రి, సతీష్ కుమార్ కోడె, గట్టుపల్లి అశోక్ రెడ్డి, రాజలింగము, మురళీధర్ రెడ్డి, సంజీవరెడ్డి, కేవీ ప్రసాద్, అలుగుబెల్లి ఆదిరెడ్డి, నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, నీలకంఠం శేఖర్, జనగామ రాజు, కారింగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి చోరీ

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామంలో శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిటిపాముల గ్రామానికి చెందిన నారగోని జగదీష్ గ్రామంలో కోళ్ల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నాడు. జగదీష్ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి కోళ్ల షెడ్డు వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు జగదీష్ ఇంటి వెనకాల తలుపులు పగులగొట్టి ఇంట్లోకి జొరబడ్డారు. ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న రెండు తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. ఆదివారం ఉదయం ఇంటికి వద్దకు వచ్చిన జగదీష్.. ఇంట్లోని బీరువా పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మౌలిక వసతులు కల్పించేందుకు కృషి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం: అభివృద్ధి ప్రజా సంక్షేమం తోపాటూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం బస్టాప్ నుంచి రామగిరి వరకు 1.7 కిలోమీటర్లు సీఆర్ఎఫ్(సెంట్రల్ రోడ్స్ ఫండ్) నిధుల నుంచి రూ.5 కోట్ల వ్యయంతో డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎర్ర రణీల, స్థానిక సర్పంచ్ బట్ట హరిత, ఎంపీటీసీ జోగు సైదమ్మ, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ సుధాకర్, ఆర్అండ్‌బీ డీఈఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ సంతోష్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

నాంపల్లి: భూ తగాదాలతో వ్యక్తి హత్యకు గురైన సంఘటన ఆదివారం రాత్రి నాంపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలంలోని తుంగపహాడ్ గ్రామానికి చెందిన కడారి వెంకటయ్య, కడారి శ్రీనయ్య అన్నదమ్ముళ్లు. వారి మధ్య కొంతకాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కడారి వెంకటయ్య, నేతళ్ల వెంకటయ్య పని నిమిత్తం ఆదివారం నాంపల్లి మండల కేంద్రానికి వచ్చి తుంగపహాడ్ గ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తున్నారు. వడ్డెపల్లి, టీపీ గౌరారం గ్రామాల మధ్యకు వచ్చేసరికి వీరి బైక్‌ను కడారి శ్రీనయ్య పెద్ద కుమారుడు శేఖర్, రెండో కుమారుడు కడారి శివ అడ్డగించి కర్రలతో దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో కడారి వెంకటయ్య(52) ఎడమ చేయి విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి నేతళ్ల వెంకటయ్య తప్పించుకున్నాడు. ఈ విషయాన్ని కడారి వెంకటయ్య కుటుంబ సభ్యులకు నేతళ్ల వెంకటయ్య చెప్పడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. కడారి వెంకటయ్య మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.